

**హిందూ** మతోన్మాద శక్తులు దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చడానికి కంకణం కట్టుకున్నాయని ప్రజాస్వామికవాదులం గత రెండు మూడు దశాబ్దాలుగా ప్రజలను హెచ్చరిస్తూనే ఉన్నాము. అది ఇవ్వాళ ఒక పీడకలగానో, హెచ్చరికగానో మాత్రమే మిగలలేదు. శైశవ దశలోనున్న హిందూరాజ్యంలోకి మనం ఇప్పటికే అడుగుపెట్టాము. 'మనమంతా హిందువులం, సింధు నది బిందువులం' అన్నది ఇప్పుడు హిందూత్వ శక్తుల  నినాదంగా మాత్రమే లేదు. వాస్తవంగా మారి దేశ రాజకీయ, సామాజిక, సాంస్కృతిక జీవనాన్ని ఛిద్రం చేస్తూ పోతోంది. ఇవ్వాళ ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్నది ఈ శక్తుల జైత్రయాత్రే. ముజఫర్ నగర్, దాద్రి, ఉనా, అల్వార్ – ఎక్కడ  ఏమి చేసినా తమను అడ్డుకునే శక్తులు లేవనే ఆనంద కేళీ విలాసంలో మునిగి ఉన్నారు వాళ్ళు. పనిలో పనిగా రెండో దశ ఆర్థిక సరళీకరణకి తెర లేపి దేశాన్ని ఆర్థికంగా కూడా నాశనం చేస్తున్నారు. పెద్ద నోట్లు రద్దు చేసి, జి.ఎస్.టి తీసుకొచ్చి జనాన్ని బెంబేలెత్తించడమే కాదు ఆర్థికాభివృద్ధి రేటు కూడా జర్రున జారి కిందపడేలా చేసారు. అన్ని వనరులనూ కార్పొరేట్ శక్తులకు నిస్సిగ్గుగా అప్పగిస్తున్నారు. అయినా...మెజారిటీ రాజకీయాల పేరుతో అన్నీ చలామణి అవుతున్నాయి. భారత్ మాతాకి జై నినాదం వెనక కనుమరుగవుతున్నాయి.

# విద్వేష రాజకీయాల నుండి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

## రాజ్యాంగం ఉందా?

భారత రాజ్యాంగాన్ని ఎవరూ తిరగ రాయకుండానే, మనమెవరమూ గమనించకుండానే ఈ నాలుగేళ్ళలో రాజ్యాంగంపై తిరుగుబాటు జరిగిపోయింది. ఈ విషయాన్ని మనకు ఫాలి నారిమన్లో, సోలి సోరాబ్జీలో విడమర్చి చెప్పాల్సిన పని లేదు. అర్థం చేసుకునే ఉద్దేశం ఉంటే సామాన్యులకు సైతం అర్థమయ్యే విషయం. ద్వేషమనే కామెర్లతో బాధపడుతున్న వారు మాత్రమే దీన్ని చూడడానికి నిరాకరిస్తున్నారు. వాళ్ళ దృష్టిలో ఇవ్వాళ ప్రజల ప్రబల శత్రువు ఆకలి, దప్పిక, నిరుద్యోగం, పేదరికం, అవిద్య, అనారోగ్యం, వివక్ష కాదు; పాకిస్తాన్, చైనాలు. వాటితో ఈ రోజు వాళ్ళు చేస్తున్నది కాల్పనిక ముష్టిఘాతాలు కావొచ్చు కాని అవే రేపు బహుశా నిజమైన యుద్ధాలుగా మారొచ్చు. గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో 61 మంది పసికందుల చావుల కంటే దోఖ్లం ఆక్రమణ గురించి మనం ఇప్పుడు ఎక్కువ విలవిలలాడిపోతున్నాం. భిన్నమతస్తులు, భిన్న రాజకీయ భావజాలం గలవాళ్ళు, రచయితలు, హేతువాదులు, ప్రజాస్వామికవాదులు అందరూ వాళ్ళ దృష్టిలో అనుమానించదగ్గ వ్యక్తులు, దేశద్రోహులు, పాకిస్తాన్ ప్రేమికులు. కారణం ఉన్నా లేకపోయినా ప్రతి ఒక్కరం పాకిస్తాన్, చైనాలను వ్యతిరేకించాలి. దేశభక్తిని ఇంటా బైటా, అన్నిటికంటే ముఖ్యంగా సోషల్ మీడియాలో, సినిమాహాళ్ళలో చాటాలి. లేకపోతే రోజుకో ఘటన. పేరుకుపోతున్న సంఘటనల దొంతర. తరానికో దొంతర. ఏది మొదటిది ఏది ఆఖరుది? కారు కింద కుక్కపిల్లలు పడటం మొదలైంది ఎప్పటి నుండి? రోహిత్ వేములను మృత్యుకుహరంలోకి నెట్టినప్పుడా? గాంధీజీని

హతమార్చినప్పుడా? పాటియాలా హౌస్ కోర్టు ప్రాంగణంలో జె.ఎన్.యు అధ్యాపకులను, విద్యార్థులను నల్లకోటు న్యాయవాదులు వెంటపడి కొట్టి 'గుణపాఠం' చెప్పినప్పుడా? ఉస్మానియా యూనివర్సిటీలో ఎ.బి.వి.పి మూకలు జార్జిరెడ్డిని చంపినప్పుడా? తగలబడి పోతున్న గుల్బర్గ్ సొసైటీవాసులు మాంసం ముద్దలై గోడలకు అతుక్కుపోయి నప్పుడా? శిలాన్యాస్, ఏకాత్మతా యజ్ఞం ప్రకటించి అద్వానీగారు రథయాత్ర పూని దేశం నలుమూలలా విద్వేష బీజాలు నాటినప్పుడా? సొహ్రబుద్దీన్, కౌసర్ బీలు చనిపోయింది ఎన్‌కౌంటర్‌లో కాదని, ఆ కథనం వంజరా, అమిత్ షా, మోదీల కనికట్టని తెలిసినప్పుడా? అద్వానీ, ఉమా భారతి, మురళి మనోహర్ జోషీలు పట్టపగలు, బాహాటంగా దగ్గరుండి బాబ్రీ మసీదును కూలగొట్టించినప్పుడా? చడీచప్పుడు కాకుండా వేకువజామున కల్బుర్గిని, రాత్రి చీకట్లో గౌరీ లంకేశ్ ని బహుశా ఒకే తుపాకితో కాల్చేసి నిష్క్రమించినప్పుడా? పన్సారే, దబోల్కర్ లను చంపినప్పుడా? ఈ సంఘటనలన్నీ దేన్ని సూచిస్తున్నాయి? ఇవి హిందూ రాజ్య అవతరణ వైపు వేస్తున్న అడుగులు కాక మరేమిటని ప్రజలను ఆలోచించవలసిందిగా కోరుతున్నాం. ఇదిలాగే కొనసాగనిస్తే మనది 'సర్వసత్తాక, సామ్యవాద, లౌకికవాద, ప్రజాస్వామ్య, గణతంత్ర' దేశంగా ఇంకెన్నాళ్ళు ఉంటుందో కూడా ఆలోచించమని కోరుతున్నాం. రాజ్యాంగ పీఠికలో లేని రోజులలో కూడా లౌకికవాదం మన రాజ్యాంగ 'మౌలిక సూత్రం' అని సుప్రీంకోర్టు చెప్పింది. మనకి మనం ఇచ్చుకున్న రాజ్యాంగం, రాజ్యాంగ విలువలు మనం చూస్తూ చూస్తుండగానే ఎప్పుడో, ఎక్కడో గల్లంతు అయిపోయి నట్టున్నాయి.

## మన దాకా రాదులే ....

లౌకికవాదం కాలం చేస్తే నష్టపోయేది కొంతమంది మైనారిటీ మతస్తులు మాత్రమే, మన జీవితాలకు ఢోకా లేదు అనుకునే వాళ్ళు కోకొల్లలు. కాని రాజ్యాంగంలోని ఒక మూలస్తంభం విరిగిపోతే మిగిలినవి చెక్కుచెదరకుండా ఉంటాయనుకోవడం ఒట్టి భ్రమ. లౌకికవాదం కేవలం మైనారిటీలకే కాదు మెజారిటీ ప్రజలకూ అవసరమే. అది రాజ్యపాలనలో మతం, మతగురువుల జోక్యాన్ని అరికట్టిన ఒక నాగరిక విలువ. ఒక అవసరం నుండి పుట్టుకొచ్చింది. కొన్ని శతాబ్దాలుగా అనేక దేశాల్లో ప్రజా జీవితాన్ని మతమౌఢ్యం నుండి కాపాడుతూ వచ్చింది. ప్రజా జీవనంలో శాస్త్రీయ దృక్పథాన్ని, భౌతికవాదాన్ని పెంపొందించింది.

పరమతస్తులపై దాడికి పూనుకునే ఈ శక్తులు తమ మతస్తుల జీవితాలపై మటుకు కనికరం చూపించాయా అంటే అదీ లేదు. తమను తాము నైతికతకు ప్రతిరూపాలుగా భావించుకునే వీరు స్త్రీల జీవితాలను మరింత కట్టడి చేయడం చూస్తూనే ఉన్నాం. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకునే వారిపై కాప్ పంచాయతీలు జరపడం, చదువుకుంటున్న ఆడపిల్లల నడవడికపై, వేష భాషలపై ఆంక్షలు పెట్టడం, ప్రేమించడాన్నే నేరంగా ప్రచారం చేయడం(ఏటా వాలెంటైన్ డే నాడు వీళ్ళు చేసే హంగామాను ఒకసారి గుర్తు తెచ్చుకోండి) వంటి ఎన్నో వికృత చర్యలకు పాల్పడుతూనే ఉన్నారు. ఆ వయస్సులో సహజంగా వికసించే ప్రేమను బలి తీసుకునే చర్యలివి. ప్రేమను, లైంగికతను, లైంగిక స్వేచ్ఛను వికృతంగా అర్థం చేసుకునే రేపిస్టులు తయారవుతున్నారంటే అవ్వరా? 'బేటి బచావో, బేటి పడావో' బి.హెచ్.యు.లో ఎంత సోయగంగా జరిగిందో చూసాం.

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలకు గొడ్డలిపెట్టయిన బ్రాహ్మణీయ భావజాలాన్ని సంఘ్ పరివార్ రాజకీయాలు మరింత బలోపేతం చేశాయి. దాడికి పూనుకోవడానికి గోరక్షకులకు దళితులైతే ఏమిటి, ముస్లింలైతే ఏమిటి, అందరూ ఒకటే. ఎవరినైనా చెళ్ళుచెళ్ళున కొడతారు, చంపుతారు. మను, యాజ్ఞవల్క్యుల స్మృతుల ప్రకారం మరణశిక్ష, భౌతిక దండన బహిరంగ శిక్షలుగా అమలు కావాలి. శిక్ష ఆత్మనే కాదు శరీరాన్ని బాధించాలి. ఈ ప్రాచీన ధర్మం నిలబెట్టే పనిలో మన రాజ్యాంగం మనకు ఇచ్చిన జీవించే హక్కు ఎక్కడ గల్లంతయిందో ఆ గోరక్షకులనే అడగాలి. ఇన్ని జరిగిపోతున్నా పోలీసులు, దర్యాప్తు సంస్థలు గాఢనిద్రలో ఉంటాయి. ఇదేమి అన్యాయమని అడిగితే మటుకు ఒక్క ఉదుటున లేచి అడిగినవారినే కొడతారు. మాకు రక్షణ కల్పించండి మొర్రో అనే వారిపైనే బి.హెచ్.యు.లో ఎఫ్.ఐ.ఆర్.లు తెరుచుకున్నాయి చూడండి , అదీ అసలు చట్ట బద్ధ పాలన అంటే!

## ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు పదిలమా!

ఇక ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో బి.జె.పి. అధికారంలో లేదు కదా, ఇది మన పంచాయతీ కాదు, దీని గురించి లొల్లి చేయడం దేనికి అనుకునే 'దేశభక్తులు' ఉన్నారు. ఈ దేశభక్తులు సరిహద్దుల వద్ద అంగుళం భూమి కోల్పోయామంటే గగ్గోలు పెడతారు కాని పెట్టుబడుల విషయంలో అన్ని హద్దులూ చెరిపేసినా ఏమీ మాట్లాడరు. అధికారంలోకి రాగానే నరేంద్ర మోదీ అశ్వమేధయాగాన్ని తలపించేలా విదేశీ పర్యటనలు చేసి పెట్టుబడులను ఆహ్వానించి వస్తే ఒక్క దేశభక్తుడూ అదేమని

అడిగిన పాపాన పోలేదు. అవునులే పెట్టుబడికి దేశీయతతో, దేశభక్తితో పనేమిటి? ఎవరి కళ్ళద్దాలనైతే స్వచ్ఛభారత్‌కి ప్రతీకగా వాడుతున్నారో ఆ 'గుజరాతీ బనియా' కుటీర పరిశ్రమల గురించి, గ్రామస్వరాజ్ గురించి, అధికార వికేంద్రీకరణ గురించి చెప్పిన మాటలు ఇప్పుడు ఎవరికి కావాలి? ఆయన కళ్ళద్దాలు కావాలి కాని ఆయన దృష్టికోణం మాత్రం అక్కరలేదు! వారు ఇప్పుడు ఆలోచించాల్సింది పెద్ద పెద్ద విషయాలను. చేయవలసింది పెద్ద పెద్ద పనులను. పెద్ద నోట్లను రద్దు చేసి దేశజనాభా మొత్తాన్నీ రోడ్లపాలు చేయడం, పశ్చిమ తీరం వెంబడి బుల్లెట్ రైళ్ళను పరిగెత్తించడం, విజయ్ మాల్యాలను, లలిత్ మోదీలను ఆర్థిక నేరాల ఉచ్చులో నుండి బైట పడేసి సర్‌హద్ పార్ చేయించడం వగైరాలు. క్షమించాలి సర్‌హద్ పార్ వంటి పదాలు వాడాల్సింది మసూద్ అజర్ వంటి ఉగ్రవాదుల గురించి కదా!

విదేశీ పెట్టుబడులయితే చాలు పంచగవ్యం చిలకరించి, గంగానదిలో మునిచి శుద్ధి చేయవలసిన పని లేదని చెప్పుకున్నాం కదా! ఈ రకమైన రియల్ టైం దివాళాకోరు ఆర్థిక విధానాన్ని గీతోపదేశంగా భావించే నేతల్లో చంద్రబాబునాయుడు అగ్రగణ్యుడు. విజన్ 2020 నుండి విజన్ 2050 దాకా ఆయన ప్రతిపాదించిన పెద్ద పెద్ద తిమింగిలాలు ఒకవైపు బక్కచిక్కిన రైతు మెడ చుట్టూ ఉరితాళ్ళు బిగిస్తుండగా మరోవైపు స్మార్ట్ సిటీలూ, స్మార్ట్ విలేజులూ సిద్ధమై పోతున్నాయి. రాయలసీమ ఎండి పోతేనేం కృష్ణా గోదావరుల అనుసంధానం జరిగితే చాలదా! చాపరాయి గ్రామంలో 16 మంది ఆదివాసులు చనిపోయింది మలేరియా వల్ల కాదు కలుషితాహారం వల్ల అనుకుంటే ఎంత సుఖంగా ఉంటుంది? దేశ ప్రధాని తీసుకొచ్చిన మన్నుతో, కోట్లాది రూపాయల ప్రజల సొమ్ముతో అమరావతి మాహిష్మతీ రాజ్యాన్ని తలదన్నే మహానగరిగా తయారవుతుంటే దాని విష పరిష్వంగంలో కృష్ణమ్మకు ఊపిరి సలపకపోతేనేమి! ఏలినవారికి ప్రజలతోనే కాదు ప్రకృతితో కూడా చెలగాటమాడే అధికారం వుంది కాబోలు! రాజధాని నిర్మాణానికి బంగారం పండే 33 వేల ఎకరాల పంటపొలాలు దేనికంటూ, తమ భూములు కాజేయవద్దని పెనుమాక, ఉండవల్లి రైతులు గొడవ చేస్తేనేమి, పనులు చేపట్టవద్దని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ స్టే ఇస్తేనేమి బాబుగారికి అవన్నీ పట్టవు. ఏ చారిత్రిక తప్పిదాల వల్ల రాష్ట్ర విభజన అనివార్యమైనదో ఆ తప్పిదాలనే ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. రాయలసీమ నుండి ఉత్తరాంధ్ర వరకు ప్రాంతీయ అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయి. గతంలో భాగ్యనగరంపై కేంద్రీకరిస్తే ఇప్పుడు సమస్త వనరులు అమరావతికి తరలిపోతున్నాయి. ఇంతటి 'అభివృద్ధి'ని తట్టుకోలేక అక్కడ తుళ్ళూరు గ్రామస్తులు, ఉత్తరాంధ్రలో వంశధార ప్రాజెక్ట్ నిర్వాసితులు రోడ్డెక్కి గొడవలు చేసి జైళ్ళకు పోతున్నారు! అదేమిటో ఆయన ప్రభుత్వానికి అన్నిట్లో ప్రతిపక్ష కుట్ర ఇట్టే కనిపిస్తుంది కాని ప్రజల భయాందోళనలు మటుకు కనిపించవు.

జవాబుదారీ లేని పరిపాలన సాగించడంలో కె.సి.ఆర్. కూడా ఏ మాత్రం వెనకబడి లేరు. ఆయన ఎంతటి అశాస్త్రీయ నీటిపారుదల ప్రాజెక్టులు ప్రతిపాదించినా, ఎటువంటి అనుమతులు లేకుండా థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులను కట్టడం మొదలుపెట్టినా, ఓపెన్ కాస్ట్ మైనింగ్ పేరుతో ఊర్లకు ఊర్లను బొందలగడ్డలుగా మార్చినా, ఆయన మూడేళ్ళ పాలనలో 3000 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా మనం అదేమని ప్రశ్నించడం తప్పు. తప్పు కూడా కాదు నేరం. ఇందిరా పార్కు దగ్గర గతంలో మీరెలా తెలంగాణ కోసం శాంతియుతంగా ధర్నా కార్యక్రమాలు చేపట్టారో మేమూ అలాగే తెలంగాణ ప్రజల కోసం ధర్నాలు చేసి వారి సమస్యలపై మీ దృష్టిని ప్రసరింప చేసుకుంటామంటే కుదరదట. దానికో పంచాయతీ. నిజాం కాలం నుండే అన్యాయాన్ని ప్రశ్నించడం అలవాటైన ప్రజలను ఇప్పుడు ప్రశ్నించవద్దు, మౌనంగా కూర్చోమంటే కూర్చుంటారా? అసలు తెలంగాణ ప్రజల్లో ప్రశ్నించే తత్వం ఉండబట్టే కదా ఆయన అధికారంలోకి వచ్చింది. ఇకనైనా యాగాలు, మొక్కులు, వాస్తు లాంటివి నమ్ముకోవడం కంటే ప్రజల మనస్సులను చూరగొనడం ముఖ్యమని ఆయన గ్రహిస్తే మంచిది.

అదేమిటో బర్మా నుండి వస్తున్న రోహింగ్యా ముస్లింలకే కాదు, ఛత్తీస్‌గఢ్ నుండి భద్రాచలం అడవులలోకి వస్తున్న గుత్తికోయలకు కూడా ప్రభుత్వాల ఆదరణ ఉండదు. బి.జె.పి అయినా, మరో పార్టీ అయినా అఖండ భారతదేశం కోసం కలలు కంటుంది కాని ఆదివాసులు మాత్రం ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రంలోకి అడుగుపెట్టకూడదని ఆంక్షలు పెడుతుంది. పెడితే ఇళ్లు తగలబెడతారు. చెట్లకు కట్టేసి కొడతారు. కేసులు బనాయిస్తారు. ఇదీ మన అఖండ భారత్ సిద్ధాంతం!

కళ్ళకు స్పష్టంగా కనిపించే విషయాలను విస్మరించి మిధ్యలో బ్రతకమంటున్నాయి మన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు. ప్రజలు బ్రతకలేకపోయినా పర్వాలేదు, వారి స్వేచ్ఛలను, జీవితాలను హరిస్తూ 'అభివృద్ధి'ని సాధించేయాలని, హిందూ రాజ్యాన్ని స్థాపించేయాలని అవి కంకణం కట్టుకుని ఉన్నాయి. ప్రజలపై, వారికి చెందే వనరులపై, వారి నమ్మికపై, సమస్త ప్రకృతిపై



# మానవహక్కుల వేదిక ఏడవ మహాసభల కార్యక్రమం

తేదీ: 14 అక్టోబర్ 2017

స్థలం: పద్మనాయక ఫంక్షన్ హాల్, మంచిర్యాల

సమయం: ఉ॥ 10 నుండి సా॥ 5 గంటల వరకు

ఉదయం: **హిందూత్వ కాలంలో దళిత పోరాటాలు**
వక్త: **జిగ్నేష్ మేవాని,** కన్వీనర్, రాష్ట్రీయ దళిత్ అధికార్ మంచ్, గుజరాత్

**ఎన్‌కౌంటర్లు – చట్టం – సుప్రీంకోర్టు**
వక్త: **బబ్లూ లోయితంగ్‌బం,** న్యాయవాది, మణిపూర్ హక్కుల కార్యకర్త

మధ్యాహ్నం: **పారిశుద్ధ్యం– ఆత్మగౌరవ పోరాటాలు**
వక్త: **బెజవాడ విల్సన్,** జాతీయ కన్వీనర్, సఫాయి కర్మచారీ ఆందోళన్

**గౌరీ లంకేశ్ హత్య – విద్వేష రాజకీయాలు**
వక్త: **శివసుందర్,** రచయిత, జర్నలిస్టు, బెంగుళూరు

**సాయంత్రం 5 గంటలకు ఊరేగింపు, ఆ తర్వాత బహిరంగ సభ ఉంటాయి.**
**అక్టోబర్ 15 సంస్థాగత కార్యక్రమం మాత్రమే**

ఇప్పుడు పెద్దఎత్తున దాడి జరుగుతోంది. కొన్ని శతాబ్దాలు పోరాడి సాధించుకున్న నాగరిక విలువలను ఒక్కొక్కటిగా తీసి పారేస్తున్నారు. ఒకప్పుడు ఇవి తిరుగులేని విలువలు, సమాజంలో కలకాలం ఉండిపోతాయని నమ్మిన విలువలు. కాని ఇప్పుడు ఒక అభిప్రాయం చెప్పినందుకు, ఒక పుస్తకం రాసినందుకు కూడా చంపుతామనే హెచ్చరికలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఒక పెరుమాళ్, ఒక హన్స్‌దా సౌవేంద్ర శేఖర్, ఒక ఐలయ్య ఈ ధోరణికి సరికొత్త బాధితులు.

ఈ సంక్షోభ కాలంలో కూడా కొన్ని ఉద్యమాలు, కొందరు వ్యక్తులు అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శిస్తున్నారు. గుజరాత్‌లో, రాజస్తాన్‌లో, ఉత్తరప్రదేశ్‌లో ఒక జిగ్నేష్ మేవాని, ఒక మేఘవంశీ, ఒక చంద్రశేఖర్ ఆజాద్ రావణ్ (భీం ఆర్మీ) నాయకత్వంలో దళితులు భూమితో సహా అన్ని రకాల హక్కుల కోసం ఉద్యమిస్తున్నారు. విద్యార్థి నాయకుల అరెస్టులకు వ్యతిరేకంగా జె.ఎన్.యు లో మొదలైన ఉద్యమం ఇప్పటికీ కొనసాగుతోంది. రోహిత్ వేముల ఆత్మహత్య సమయంలో ప్రజాస్వామిక శక్తులు సంఘటితం కావడం చూశాం. అంతకన్నా ముఖ్యంగా ఇన్నాళ్ళూ నిస్సహాయతకీ, ఆత్మహత్యలకీ నిలువెత్తు నిదర్శనంగా కనిపించిన రైతులు ఇప్పుడు ఆగ్రహానికి ప్రతీకలుగా మారి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడులలో ఆందోళన బాట పట్టడం చూస్తున్నాం. ఎక్కడికక్కడ ఉద్యమ కారులు, సామాజిక కార్యకర్తలు, మేధావులు, సాధారణ ప్రజలు చేస్తున్న ఈ పనులే మనకు ప్రజాస్వామ్య భవిష్యత్తుపై ఆశను మిగిలిస్తున్నాయి. ఈ ఆశను నిలబెట్టడం మనందరి కర్తవ్యం.

దేశాన్ని కబళిస్తున్న ఈ హిందూత్వ శక్తులను శక్తివంతంగా ఎదిరించాలంటే ప్రాచీన కాలంలో బుద్ధుడు, చార్వాకులు, బసవడు, భక్తి ఉద్యమం; ఆధునిక కాలంలో పూలే, అంబేద్కర్, పెరియార్లు బ్రాహ్మణ్యానికి వ్యతిరేకంగా చేసిన పోరాటాల నుండి మనం మరింత స్ఫూర్తిని పొందాలి. ఆ స్ఫూర్తితోనే దాదాపు ఇరవై ఏళ్ళుగా హక్కుల రంగంలో తన పనితీరును మెరుగు పరుచుకుంటూ వస్తున్న మానవహక్కుల వేదిక అక్టోబర్ 14,15 తేదీలలో మంచిర్యాల (పాత ఆదిలాబాద్ జిల్లా)లో తన ఏడవ మహాసభలను జరుపుకోబోతోంది. మీరందరూ హాజరై సభలను జయప్రదం చేయాల్సిందిగా కోరుతున్నాం.

**2 అక్టోబర్ 2017**

మానవహక్కుల వేదిక
**Human Rights Forum (HRF)**

ప్రచురణకర్తలు : ఎస్. జీవన్ కుమార్ – 98489 86286, వి.ఎస్. కృష్ణ – 94404 11899